క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలని వినతి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చండూరు(గట్టుప్పల్) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం గట్టుప్పల్ తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏడుకొండల్, నవీన్, బుజ్జయ్య, రవి ఉన్నారు.

సబ్సిడీ నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం సరికాదు

నల్లగొండ టౌన్: నిరుద్యోగులకు ఇచ్చే వాహనాలపై సబ్సిడీ ఎత్తివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరికాదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అన్నారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్యాక్సీలు, మోటార్ క్యాబ్‌లపై ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఇచ్చే సబ్సిడీలను కొనసాగించాలని కోరారు. బ్యాంకులకు రుణాలు కట్టలేక పోవడం వల్ల వాహనాలను జప్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరశురాము తదితరులు పాల్గొన్నారు.

గుండ్రాంపల్లిలో సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, వార్డులో అవసరమైన డ్రెయినేజీ, బస్సు షెల్టర్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొడిగె సైదులు, గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం, సహాయ కార్యదర్శి కేతరాజు యాదయ్య, సీమ వెంకటేశం, పానుగుల్ల శివ పాల్గొన్నారు.

దాడిపై ఖండన

చిట్యాల: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్, యువమోర్చా నియోజకవర్గ కన్వీనర్ గరిషే నరేష్, జిల్లా నాయకుడు అంశల అనిల్‌కుమార్ మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల దాడి ఘటనకు సీఎం, పీసీసీ అధ్యక్షుడు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

హామీల అమలులో విఫలం

కనగల్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల శివన్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పీఆర్సీ అమలు చేసి ఉపాధ్యాయ, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు

చిట్యాల: తన చికెన్ సెంటర్, పంక్చర్ షాపు ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో దగ్ధమయ్యాయని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఉడుగు పాండు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాడు. తన దుకాణం సమీపంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసం ఉందని, దాని చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఉన్నాయని తెలిపాడు. వాటిని పరిశీలించి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరినట్లు పాండు తెలిపాడు.

మాలధారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రామసుందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

రామగిరి(నల్లగొండ): పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో పాదూరి రామసుందర్‌రెడ్డి జ్ఞాపకార్థం అయ్యప్ప, శివ దీక్ష స్వాములకు మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామసుందర్‌రెడ్డి సతీమణి పాదూరి కరుణ, ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, కుటుంబ సభ్యులు రవికాంత్‌రెడ్డి, శశికాంత్ రెడ్డి, స్రవంతి, నాగార్జునరెడ్డి, శ్వేతారెడ్డి, హరీష్, అర్చకులు అజయ్, ఉదయ్, రుద్ర సేనా సభ్యులు దారా వెంకట్, కాసర్ల శేఖర్‌రెడ్డి, హరిబాబు, సోమశేఖర్ పాల్గొన్నారు.

రుణమాఫీ అయ్యేదెప్పుడో!

- కెనరా బ్యాంకులో రుణాలు రెన్యువల్ చేసుకున్న రైతులకు వర్తించని రుణమాఫీ పథకం
- ఆ.. బ్యాంకులో ఐదేళ్ల పాటు రైతు రుణఖాతా మార్చకపోవడమే కారణం
- మునుగోడు మండలంలో సుమారు 600మందికి చేకూరని లబ్ధి
- రుణమాఫీకి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న కర్షకులు



మునుగోడులోని కెనరా బ్యాంక్

మునుగోడు : కెనరా బ్యాంకులో పంట రుణాలు తీసుకుని రెన్యువల్ చేసుకున్న రైతులకు రుణమాఫీ పథకం అమలు కావడం లేదు. ఆ బ్యాంక్ నిబంధనల కారణంగా నేటికీ ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ పథకం వర్తించకపోవడంతో అర్హులైన అనేక మంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీసుకున్న రుణాలను ప్రతి ఏటా సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు తీసుకున్నామని, అర్హత కలిగిన తమ రుణాలను ఎప్పుడు మాఫీ చేస్తారని ఆ రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రధాన కారణం ఇదీ..

కెనరా బ్యాంక్‌లో పంట రుణాలు పొందిన రైతు రుణ ఖాతా నంబర్‌ను ఐదేళ్ల పాటు అదే కొనసాగిస్తారు. ఆ ఖాతా నంబర్ మార్చకుండా ప్రతి ఏటా రైతు నుంచి అసలు, వడ్డీ వసూలు చేసి ఆ వెంటనే రుణాలు మంజూరు చేస్తారు. దీంతో ఆ రైతు రుణం తీసుకున్న తేదీ, సంవత్సరం మొదటిసారి రుణం తీసుకున్నదే కొనసాగుతుంది. ప్రభుత్వం రుణమాఫీకి 12.12.2018 నుంచి 09.12.2023 తేదీ లోపు రుణం తీసుకుని ఉండాలని ప్రకటించింది. అయితే కొందరు రైతులు 12.12.2018 కంటే ముందు రుణాలు తీసుకొని ప్రతి ఏటా అసలు వడ్డీ చెల్లించి తిరిగి రుణం పొందారు. కానీ ఆ రైతులకు మాత్రం రుణమాఫీ పథకం నేటికీ వర్తించలేదు. మరికొంత మంది రైతులు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన తరువాత 2023 డిసెంబర్ నుంచి రెండు నెలల క్రితం వరకు తమ రుణాలు చెల్లించారు. అయితే, అందులో ఐదేళ్లు పూర్తయిన రైతులు కొందరు ఉండటంతో బ్యాంక్ అధికారులు కొత్తగా ఇచ్చిన రుణాల మంజూరు తేదీని 2024 సంవత్సరంలోకి మార్చడంతో అలాంటి రైతులకు కూడా పథకం అమలు కాలేదు. బ్యాంక్ అధికారుల తప్పిదం తమకు శాపంగా మారిందని అర్హులైన రైతులు వాపోతున్నారు.

మునుగోడు మండలంలో ఇలా..

మండలంలోని దాదాపు 10వేల మందికి పైగా రైతులు మునుగోడు, పలివెల, కొంపల్లిలోని కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లలో రుణాలు పొందారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల లోపు రుణాలు దాదాపు 6వేల మందికి వర్తించింది. అందులో ఇప్పటి వరకు 2వేల మంది రుణాలు రెన్యువల్ చేశారు.రుణమాఫీకి అన్ని అర్హతలు కలిగిన దాదాపు 600 మంది రైతులు గత 2018 డిసెంబర్ కంటే ముందు పంట రుణాలు తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో ఉండటంతో ఆ రైతులకు రుణమాఫీ కాలేదు. అంతే కాకుండా గత జనవరి మాసం నుంచి జూన్ మాసం వరకు రుణాలు చెల్లించిన మరికొందరిది కూడా ఇదే పరిస్థితి.

బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా..



మునుగోడు కెనరా బ్యాంక్‌లో 2019 సంవత్సరంలో రూ.24 వేల రుణం తీసుకున్నా. దానిని ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తుండటంతో గత 2023 ఏప్రిల్ మాసంలో రూ. 26వేల రుణం ఇచ్చారు. తిరిగి 2024లో బ్యాంక్ అధికారుల ఒత్తిడి మేరకు గత ఏప్రిల్‌లో తిరిగి రెన్యువల్ చేయగా నా రుణ ఖాతా నంబర్ మారిపోయింది. నా పేరు రుణమాఫీ లిస్టులో వచ్చినప్పటికీ పాత ఖాతా నంబర్ లేకపావడంతో రుణం మాఫీ కాలేదని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేస్తే రుణమాఫీ అవతుందని చెప్పారు. బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నా.

– ఎం. యాదయ్య, రైతు, మునుగోడు

220 మందికి రుణమాఫీ వర్తించలేదు

రుణమాఫీ కానీ రైతుల వివరాలు వ్యవసాయ అధికారులకు తెలియజేశాం. వారి పేర్లు నాలుగో లిస్టులో వచ్చాయి. ప్రభుత్వం ఆ రైతులకు సంబంధించిన రుణమాఫీ డబ్బులు కేటాయించిన వెంటనే వారి ఖాతాల్లో జమచేస్తాం. కెనరా బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులకు రుణ ఖాతా నంబర్ ఐదేళ్ల పాటు ఒక్కటే ఉంటది. దీని కారణంగా ప్రతి ఏటా రెన్యువల్ చేసుకున్న దాదాపు 220 మందికి, 2024 సంవత్సరంలో రుణాలు చెల్లించిన మరి కొంతమందికి పథకం వర్తించలేదు.

– ప్రవీణ్, కెనరా బ్యాంక్ మేనేజర్, మునుగోడు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఎంపీడీఓ కార్యాయలం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా మండలాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగధర్‌రావు, కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల సుకన్య, ఎంపీడీఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, చిత్రంలో పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్, స్టేషనరీ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెనూ చార్జిలు పెంచాలన్నారు. అనంతరం ఏఓ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పబ్బు వీరస్వామి, కే.ఎస్.రెడ్డి, ఎం.శాంతకుమారి, విజయ, అంజలి, యాదమ్మ, కవిత, జయమ్మ, భాగ్య, పద్మ, వసీమా బేగం, స్వప్న, నిర్మల, సరస్వతి, భారతి, సునిత, మంగ, సుశీల, ధనమ్మ, సైదమ్మ, సంతోష, స్వర్ణ, పార్వతి, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టౌన్: సెయింటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిసు చర్చి, వైఎంసీఏ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు టిఎస్. క్రిస్టఫర్, ఆలిండియా క్రిస్టియన్ పొలిటికల్ జనరల్ సెక్రటరీ పసల శౌరయ్య, వైఎంసీఏ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్. విలియమ్స్, ఎలీసా, ఆశయ్య, పాస్టర్ ప్రవీణ్‌కుమార్, ఆనంద్‌ప్రసాద్, నతానియెల్ పాల్గొన్నారు.

మదర్ మ్యారేజీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

మదర్ మ్యారేజీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంతులు శ్రీనివాస్, మదర్ మ్యారేజీ బ్యూరో అధ్యక్షుడు గోలి భూపాల్‌రెడ్డి, రాష్ట్ర చైర్మన్ కాసాల యాదగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో...

నల్లగొండ: రవాణా శాఖ హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ శాఖ కార్యాలయంలో డీటీసీ ఎస్.వాణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎంవీఐ లావణ్య, ఏఓ రవీందర్, సోని, కిరణ్‌కుమార్, రమేష్, మధుసూదన్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వైస్ చైర్మన్ రమేష్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వాణి

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రం చూపుతున్న టీఎన్జీఓ నాయకులు

నల్లగొండ: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీఓ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని నల్లగొండలోని ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యతులు మురళి, శేఖర్‌రెడ్డి మాట్లాడారు. విధుల్లో జాయిన్‌కాని కార్యదర్శులతోపాటు కొందరు రెగ్యులరైజేషన్ గురించి ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.కె.ఖాసీం, జి.సతీష్, గీతాంజలిగౌడ్ పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం దేవరకొండలోని బంజారా భవనలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. టీజీయూఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బాణావత్ సైదులునాయక్, ఉపాధ్యక్షుడు మూడ్ తిరుపతినాయక్ హాజరై ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా మిర్యాలగూడకు చెందిన కుర్ర కృష్ణకాంత్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా కెతావత్ పంతునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కెతావత్ గోవింద్‌నాయక్, మోతిలాల్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హేమా నాయక్, టాక్రు, మల్లేష్, గిరి పాల్గొన్నారు.

తిప్పర్తిలో కృష్ణా జలాలు వృథా



తిప్పర్తిలో పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న కృష్ణాజలాలు

తిప్పర్తి : మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రోడ్డు వెంట తవ్వకం పనులు చేపట్టగా మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలి కృష్ణా జలాలు వృథాగా పోతున్నాయి. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి, నీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో సహకార బ్యాంకు సేవలు

- తీరనున్న తిప్పర్తి మండల రైతుల వెతలు
- మండల కేంద్రంలో సహకార బ్యాంకు ఏర్పాటు
- రేపు మంత్రి చేతుల మీదుగా ప్రారంభం



తిప్పర్తిలో ఏర్పాటు చేసిన సహకార బ్యాంకు

తిప్పర్తి : తిప్పర్తి మండల రైతులకు సహకార బ్యాంకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతూ చేదోడు వాదోడుగా ఉంటోంది. ఇకపై బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చేందుకు మండల కేంద్రంలో సహకార బ్యాంకును ఏర్పాటు చేస్తున్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల పంటను కొనుగోలు చేయడంలో ముందు వరుసలో నిలిచింది. ఇకపై కోఆపరేటివ్ సేవలు కూడా రైతులకు చేరువ కానున్నాయి. తిప్పర్తి సహకార సంఘంలో సుమారు 5వేల మంది రైతులు ఉన్నారు. సహకార బ్యాంకు అందుబాటులో వచ్చిన తరువాత రైతులు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. సహకార బ్యాంకుతో పాటు ఏటీఎంను కూడా ఏర్పాటు చేయనున్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సహకార బ్యాంకును ఈనెల 9న(గురువారం) రాష్ట మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతుల సౌకర్యార్థమే..



తిప్పర్తి మండల రైతులు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలో సహకార బ్యాంకు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పీఏసీఎస్ ద్వారా రైతులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నాం. వారికి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి, పండించిన పంటను కూడా కొనుగోలు చేస్తున్నాం. రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా సహకార సంఘం ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నాం.

– డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి

డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలి

- యాంటి నార్కోటిక్ డీఎస్పీ భిక్షపతి

చిట్యాల: డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యాంటి నార్కోటిక్ డీఎస్పీ భిక్షపతి కోరారు. చిట్యాల పట్టణంలోని సాయిభారతి జూనియర్ కాలేజీలో మంగళవారం యాంటి నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం కారణంగా క్రైం రేట్ పెరగటంతో పాటు యువత అనారోగ్యం పాలవుతోందని ఆందోళనవ్యక్తం చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఆ కాలేజీ ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి తెలిపారు. మంగళవారం ఆమె స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7,8,9,10 తరగతుల్లో మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు 6వ తరగతి, మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా యువజన దినోత్సవం

నల్లగొండ టూటౌన్: దేశభక్తులను తయారు చేసేందుకు ఏబీవీపీ కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. ఆయన మంగళవారం ఎంజీ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవాలకు హాజరై మాట్లాడారు. దేశంలో అనేక విద్యార్థి సామాజిక ఉద్యమాలను నిర్మించిన ఘనత ఏబీవీపీదన్నారు. వివేకానందుని స్ఫూర్తితో యువకులు జాతీయ పునర్నిర్మాణం వైపు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఓఎస్డీ ప్రొఫెసర్ అంజిరెడ్డి, సౌమిత్రి లక్ష్మణాచార్య , ఛత్రపతి చౌహాన్, సామల అఖిల్ రెడ్డి, మానేష్ చారి, రాజేష్, మోహన్, సాయి, సూర్య, విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ధర్మ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్, భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ముందుగా ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ సుభాష్ మహారాజ్, సంతోష్, సందీప్ తదితరులు ఉన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడికి కలెక్టర్ అభినందన



అమృత్‌సింగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్

నల్లగొండ: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఇటీవల నిర్వహించిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఇండియా పోటీలు 245 కిలోల విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన సాగర్ అమృత్‌సింగ్ మొదటి బహుమతి సాధించాడు. ఈ మేరకు మంగళవారకలెక్టర్ ఇలా త్రిపాఠి తన చాంబర్‌లో సాగర్ అమృత్‌సింగ్‌కు జ్ఞాపిక అందజేసి అభినందించారు. సాగర్ అమృత్‌సింగ్ బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తూనే పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర ,జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. అమృత్‌సింగ్ పేరిణి, భరత నాట్యం కళాకారుడు కూడా. 60శాతం వినికిడి లోపం ఉన్నా ఇన్ని రంగాల్లో రాణించడంపై అతడిని కలెక్టర్ ప్రశంసించారు.

నిధుల మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం



మండలి చైర్మన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి లింకు రోడ్లు, చెరువుల అభివృద్ధికి రూ.6.50కోట్ల మంజూరుకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఉరుమడ్ల గ్రామానికి వచ్చిన రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పల్లపు బుద్ధుడు, కోనేటి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు సైదులు, నాయకులు జన్నపాల శ్రీను, పోలగోని స్వామి, పాకాల దినేష్, కురుపటి లింగయ్య, గుత్తా రవీందర్‌రెడ్డి, మేడబోయిన శ్రీను, అనంతుల శంకర్, వేముల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నల్లగొండ : రిలే దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్: లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని, ఇందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే ఆదేశాలివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పోరాట సాధన కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేసి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు స్వాధీనం చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి.సలీం, దండంపల్లి సత్తయ్య, సయ్యద్ హాశం , డబ్బికార్ మల్లేష్, వీరవల్లి వెంకటేశ్వర్లు, గంజి మురళిధర్, కంబాలపల్లి ఆనంద్, దండంపల్లి సరోజ, రవినాయక్, తుమ్మల పద్మ, అరుణకుమారి, ఉమారాణి, అద్దంకి నర్సింహ, అవుట రవీందర్, అశోక్‌రెడ్డి, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మి, దివ్యలక్ష్మి, జయమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి

చిట్యాల: ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడంతో అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం చిట్యాలలో జరిగిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుకు నిధుల కొరతను సాకుగా చూపించటం సరికాదన్నారు. డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ఓకు అనుమతినివ్వడం హర్షణీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల విజయానికి కృషిచేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, గుడిసె లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు

పెద్దవూర : ప్రజా పంపిణీలో అవకతవకలకు పాల్పడిన నీమానాయక్‌తండా రేషన్ డీలర్ రమావత్ దేశ్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీ ముక్తార్ తెలిపారు. మంగళవారం మండలంలోని చలకుర్తి చౌకధరల దుకాణంలో తనిఖీ చేయగా 23.88 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని, అవకతవలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పెద్దవూర ఆర్ఐ హబీబ్ ఉన్నారు.